# కానుక

"ఎస్ ! గుర్తొచ్చింది " గట్టిగా అరిచాడు.

" ఏం గుర్తొచ్చింది ?" నవ్వు బిగబట్టుకుంటూ అడిగింది.

"ఈరోజు టీచర్స్ డే. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు !"

40 ఏళ్ల భర్త ఎలిమెంట్రీ స్కూలు పిల్లాడిలా సమాధానం చెప్పడం చూస్తే మూర్ఛ వచ్చినంత పనైంది జాహ్నవికి. అప్పుడైనా ఆరోజుకు తమ జీవితంలో ముడిపడి ఉన్న ముఖ్యవిషయం గుర్తుకు రాకపోవడం ఆమెకు మరింత బాధ కల్గింది.

ఇంత సేపూ అతను మరచిపోయిన విషయాన్ని సుతిమెత్తగా మందలించి గుర్తు చేద్దామనుకుంది. కాని, అతని సమాధానం ఆమెలో మినుకుమినుకుమంటూ మిగిలిన ఆ ఒక్క ఆశనూ ఆర్పేసింది. ఇంతటి జడ పదార్థానికి నిజంగా ఇప్పుడు అసలు విషయం చెప్పినా, ఏదో మార్పొస్తుందనే నమ్మకం అణుమాత్రమైనా మిగలలేదు ఆమెలో. అసలు రాత్రి నుండీ ప్రయత్నిస్తున్నది. సరిగ్గా 12 దాటగానే చెవిలో గుసగుసగా చెప్పి, అల్లుకుపోవాలనుకున్నది కాని, నిద్రపోతే కుంభకర్ణుడే. పైగా గురక. ఆ గురకలో ఉరుముల శబ్దమూ అతనికి బలాదూరే. అయినా అభిమానమాపుకోలేక, అతని స్పందన లేకున్నా చెప్పింది గుసగుసగా కాదు బిగ్గరగానే - కాని, ఏనుగుమీద వలానపడ్డట్లే అయ్యిందా ప్రయత్నం.

ఉదయమేమో అతనికి తనకంటే గంట ముందులేవటం అలవాటు. తను లేచేసరికి సీరియస్‌గా ఏదో వ్రాసుకుంటున్నాడు. ఆ పనిలో నుండి బయటపడితేనైనా అసలు విషయం గుర్తుకు రాకపోతుందా ?! అనుకుంది. ఆ ఆశ కూడా ఆవిరైపోతూంటే ఆమెలో నీరసం, నిరుత్సాహం పెరిగిపోసాగాయి. ఇప్పుడు అంత రంగంలోని అగ్నిపర్వతం బద్దలై దుఃఖం లావా ఏ క్షణంలో నైనా బయటపడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తయారైంది.

మరోపక్క శ్యాం - తన సమాధానానికి సంతోషించే శ్రీమతి ఎక్స్‌ప్రెషన్ కోసం చూసి ఖంగుతిన్నాడు. ఆమె మొహం నిరుత్సాహంగా, నిస్తేజంగా కనిపించేసరికి కంగారు పడ్డాడు. 'తనకసలే మతిపరుపు. రాధాకృష్ణన్ పుట్టినరోజుతో ఎవరైనా పోయినదినం గాని ముడిపడిపోయి ఉందా ? అదీ.. ఎవరైనా దగ్గరివాళ్లు .....'



"ఔనూ ! సారీ ... ! నాకు మతిమరుపని తెలుసుకదా ! ఏదైనా ఉంటే నువ్వు గుర్తు చెయ్యొచ్చుకదోయ్ ! మొత్తంమీద ఈ రోజు ఏదో ముఖ్యమైనరోజే. ఎవరో దగ్గరివాళ్లు పోయినరోజు..." శ్యామ్ మాట పూర్తికాలేదు.

అతన్ని గబుక్కున అల్లుకొని, భోరుమంది.

మరింత కంగారు పడిపోయాడు - "సారీ రెండక్షరాలు అతికష్టం మీద గుండె చెమ్మనద్దుకొని గుండెలోనుండి బయటికొచ్చాయి.

పద్దెనిమిదేళ్ళ దాంపత్య జీవితంలో ఏనాడూ శ్యామ్‌కి ఆరోజు గుర్తుండదు. ఆరోజేగాదు. వ్యక్తిగత జీవితాలతో ముడిపడి ఉన్న తేదీలేవీ అతనికి గుర్తుండవు. పైగా ఏదో పత్రికకు కథ పంపే పనిలో నిండా మునిగి ఉండడం, ఎప్పుడూ ఏవేవో ఆలోచిస్తూ ఉండటం కూడా అతని పరాకుకు కారణం. ఒక రచయితగా పేరు, కవిగా గుర్తింపూ సాధించాడు. తోటి వారికి అవసరమైన సాయం చేయడంలో అతనికి కల్గే తృప్తి మరేపనిలోనూ కనిపించదు. జాహ్నవి కూడా భర్త స్వభావన్నర్థం చేసుకొని, అతనికి అనుకూలంగానే మసులుకుంటూంటుంది. ఆణిముత్యాల్లాంటి కొడుకునూ, కూతురినీ 'గొప్ప చదువుల పేరుతో హాస్టల్ వసతుల కాలేజీలకు అంకితం చేశాక, ఆమె మనసు భర్త సాన్నిహిత్యాన్ని ఎక్కువగా కోరుకోసాగింది. కాని శ్యామ్

జాహ్నవి మాట్లాడలేదు. మొహంలో ఏ భావమూ ప్రకటించనూ లేదు. అతను మాత్రం చెప్పుకుపోసాగాడు.

"మా చిన్ననాటి మాష్టారు శివానందం గారి పదవీ విరమణ సన్మానసభ ఈరోజు మా ఊళ్లో ఏర్పాటు చేశారట. ఇది పోయిన్నెల ముప్పై ఒకటికే జరగాలి. కాని ఘనంగా చేయాలని ఈరోజును నిర్ణఇంచారట. నాకోసం రెండు మూడు రోజుల్నుండీ ట్రై చేస్తున్నారట. మనం వెంటనే రామాపురం (రాంపూర్) బయల్దేరాలి.." అది ఖచ్చితంగా అర్థింపే. కాని అనివార్యమైన ఆజ్ఞ కూడా అందులో ఉంది.

జాహ్నవి నిట్టూర్చింది. "సరే " అనలేకపోయింది. 'వీలుకాదు' అనే అవకాశమూ ఆమెకు లేదు మరి.

0-0-0

జాహ్నవి ఊహించినదానికి భిన్నంగా ఉందక్కడి పరిస్థితి. సిటీకి సుమారు 50 కి.మీ. దూరంలో ఉన్న ఆ ఊరిని వాళ్లు పూర్తిగా వదిలేసి 15 సంవత్సరాలైంది. ఆ మూలనున్న ఊళ్లో ఓ ఎలిమెంటరీ స్కూల్లో వందా రెండువందల మంది విద్యార్థుల సమక్షంలో వాళ్లూ-వీళ్లూ కలిసి మరో యాభైమంది మధ్య ఓ గంట-గంటన్నర కార్యక్రమం తూ-తూ మంత్రంలా ఏదో అయ్యిందనిపిస్తారు కదా ! అనుకుంది. ఆమె అనుభవంలో అలాంటి కార్యక్రమాలు కొన్ని చూసింది కాబట్టి. కాని... పెళ్లిసందడిని తలపించే పేరోలగం. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన చిన్ననాటి మిత్రులు అక్కడ కలుసుకున్న అపురూప సన్నివేశమిది. వాళ్ల ఆనందం వర్ణనాతీతం. బాల్యపు మాధుర్యాలను పంచుతుంది. ఆ అనుభూతితో పులకిస్తున్న వాళ్ల మొహాలు వేలకాంతులతో వెలిగిపోతున్నాయి. చిన్నప్పటి కట్టుబాట్లు కూడా ఇప్పుడు సడలిపోవటంతో ఎంతో ఆత్మీయంగా వాళ్లు మమేకంగావడం కొత్త అందాలను దిద్దింది.

నాలుగ్గంటలకు కార్యక్రమం కాగా ఒంటిగంటకే వీళ్లక్కడికి చేరుకున్నారు. పెళ్లిభోజనం లాంటి భోజనం వాళ్ల హృదయాల్లాంటి అరటి ఆకుల్లో, ఆత్మీయతా పదార్థాలతో, సహపంక్తి సంప్రదాయంలో, అందరి సందడిలో అయింది.

ఆ మేష్టారు శివానందంగారు అపర శివావతారుడిలా వెలిగిపోతున్నాడు. తెల్లని సంప్రదాయ వస్త్రాల్లో , నుదుట విభూతి రేఖలతో, కనుబొమల మధ్య కుంకుమ చందనాల బొట్టుతో, కరుణామృత దృక్కుల్తో, చిరునవ్వు చెరగని పలకరింపుతో శిష్యుల్ని స్నేహితుల్లా హృదయానికి హత్తుకుంటూ.... ఆ పవిత్ర ప్రాంగణంలో పరమేశ్వరుడిలా తిరుగుతూ ఉన్నాడు.

వాళ్లందరినీ ఒడుపుగా తప్పించుకుంటూ జాహ్నవి చేయిపట్టుకొని తను అక్షరాలు దిద్దుకున్న తరగతి గదిని, గోడకుర్చీ వేసిన స్థలాన్ని-బిళ్ళంగోడు ఆడుతుంటే అయిన గాయం మరక ఎక్కడ, ఎలా అయ్యిందో ఆ చోటుని, ఆపై కొద్ది దూరంలో ఉన్న మర్రిచెట్టు మీద తాము కోతి కొమ్మచ్చి ఆడుకున్న వైనాన్ని...ఒక్కొక్కటే వర్ణిస్తూ ఆ చెట్టుకింద ఓ బండమీద కూర్చున్నారిద్దరూ. భర్తనలా చూస్తుంటే ఆనందంగా, విచిత్రంగా ఉంది జాహ్నవికి. 'ఎప్పుడూ ప్రయోగశాలలో సైంటిస్టులా పుస్తకాలతో కుస్తీపట్లు పడుతూ, మౌనసామ్రాజ్యాన్నేలే ఆ మానవుడేనా ఇతడు ?'' అనిపించింది. రెండో తరగతిలో రన్నింగ్ రేసులో ఫస్టొచ్చినపుడు కొడుకు సాకేత్ తన విజయాన్ని ఎలా వర్ణించి చెప్పాడో - అచ్చు అలాగే అనిపిస్తున్నాడు శ్యాం ఆమె కళ్ళకు.

మరీ అంత కలివిడిగా బయటికి కనిపించక పోయినా, శ్యామ్, జాహ్నవిలది అనుకూల దాంపత్యం. అన్యోన్య దాంపత్యమే. అతనే ఆలోచన చేసినా తుది నిర్ణయాధికారం భార్యకే వదిలేయడం అతని కలవాటు. అతనే ఆలోచన చేసినా అదే చాలా బాగుంటుందని కితాబునివ్వడమే ఆమెకు తృప్తి.

"ఔనూ ! మా చిన్ననాటి మాష్టారాయన. ఆయన వేసిన తెలుగు పునాదులమీదే నేను కథల మేడలు కడుతున్నాను. కవితల హర్మ్యాలు నిర్మిస్తున్నాను. మొక్కుబడిగా మనం తెచ్చిన ఈ 'బొకే' ఇప్పటికి అందాన్నీ, ఆనందాన్నీ కలిగిస్తుందేమో గాని, కనీసం కొంతకాలమైనా తోడుండేది గాదు. ఏదైనా కానుక ఇవ్వాలి. ఏమిస్తే బాగుంటుంది అడిగాడు''?

ఆలోచించింది జాహ్నవి. " మీరేమివ్వాలనుకుంటున్నారు ? అయినా సిటీ నుండి వస్తూ ఏమి తేలేదు గదా ? ఇక్కడేం దొరుకుతాయి ?''

"అదే ఆలోచిస్తున్నా.... పోనీ డబ్బులేమైనా కవరులో పెట్టి ఇద్దామా...ఇస్తే ఎంతివ్వాలి ? వంద...రెండొందలు..ఐదారొందలు...వెయ్యి...'' కరణేషు మంత్రి' నడిగాడు. "మీవద్ద ఇప్పుడేమాత్రమున్నాయి ? ఉంటే వెయ్యినూటపదహార్లిస్తే బాగుంటుంది..''

అయ్యో ! అంతున్నాయో లేదో... బహుశా ఏడెనిమిది దాకా ఉన్నాయేమో !'' మనసులోనే లెక్కలు గట్టుకుంటూ అన్నాడు శ్యామ్.

"అబ్బా ! మీరిక్కడున్నారా ? కార్యక్రమం మొదలైంది. మాష్టారు సంగతి నీకు తెలుసుగదా! ఆయన టైమంటేటైమ్. పదపద - ప్రార్థన నువ్వే పాడాలి !'' సుడి గాలిలా వస్తూనే బాంబులాంటి నిర్ణయం విసిరాడు హరి (వాడతనికి ఒకటోతరగతి నుండి బెంచిమేటు) "నేనా!'' నమ్మలేనట్టంటూ - "వేరే ఎవరూ లేరా ?'' అడిగాడు.

"ఒరేయ్ ! బడిలో చాలామందే ఉన్నారురా ! కాని, ఈ కార్యక్రమంలో పాడాల్సింది నువ్వే. ఓ సర్వలోకశ ఓదేవ దేవ ! దీవించి మమ్మేలు దీనమందార ! ఏ పాపమెరుగని పసిపాపలమురా ! అంటూ నీనోట వినేందుకు అందరూ ఎదురుచూస్తున్నారు.... "

"ఒరేయ్ ! ముప్ఫైయేళ్ళ క్రిందట రోజూ పాడిన మాట నిజమే. ఇప్పుడు గుర్తురావద్దూ. ముందైనా చెప్పితే కాగితంమీద రాసి తెచ్చుకొనేవాడిని. నా వల్లగాదు. నువ్వూ ఉపాధ్యాయవృత్తినే వెలగబెడ్తున్నావు గదా ! ఆపనేదో నువ్వే చెయ్యి. చాలా బాగుంటుంది !".

"నేనా? నేను పాడేవి చచ్చుసినిమా పాటలు. ఎనిమిదో తరగతిలో ఓసారి ఇలాగే - మంగమ్మా - నువ్వు ఉతుకుతుంటే అందం... 'అంటూ అల్లురామలింగయ్య పాట పాడుతుంటే - ఆయా రంగమ్మ చీపురు పట్టుకొచ్చింది నాగొంతు వినలేక - మరచిపోయావా ?"

ఆసీన్ గుర్తుకు రాగానే నవ్వాగలేదు శ్యామ్‌కి.

'అబ్బ ! పాడండి ! నాకూ వినాలనుంది !" హరికి వత్తాసు పలికింది జాహ్నవి.

"నేనిప్పుడు పాడలేనోయ్, ప్రాక్టీసు లేకుండా పాడితే ఘోరంగా ఉంటుంది. ఇప్పుడు నేను చిన్నపిల్లవాడిని కాదుగదా ?'

"పసిపాపలమురా అని పాడమంటుంటే చిన్నపిల్లవాడిని కాదంటున్నావా ? బుద్ధిహీనుడిలా మాట్లాడకు 'ఇదే తుది నిర్ణయం' అన్నట్లు గబగబా అక్కడినుండి కార్యక్రమ స్థలంవైపు పరుగులాంటి నడకనందుకున్నాడు హరి.

అయోమయంగా ఒకరినొకరు చూసుకుంటూ అనుసరించారు జాహ్నవి, శ్యామ్. ' ఈ పాట నువ్వూ నేర్చుకొన్నావుగా, ఇద్దరం కలిసే పాడదాం. నేను ఒక్కణ్ణే పాడబోయి, మధ్యలో గుర్తురాక - నువ్వు దూరం నుండి గుర్తుచేయటం బాగుండదు" అని జాహ్నవితో చెప్పి తామిద్దరూ కలిసి పాడబోతున్నామని హరికి చెప్పివచ్చాడు శ్యాం.

మధుసూదన్ వ్యాఖ్యానంతో కార్యక్రమం మొదలైంది. అతిథుల స్వాగతం, జ్యోతిప్రజ్వలన పూర్తయ్యాయి. ప్రార్థన ఎవరు పాడతారో ప్రకటించి, గాయకుల పరిచయం కూడా చెప్పేశాడు మధు. సభంతా కరతాళ ధ్వనులతో వాళ్లకు స్వాగతం పలికింది.

మొదట్లో కొంచెం తడబడినా వెంటనే సాగరం వైపు సాగే నదీగమనంలా గంభీరంగా, సుందరంగా, ఆర్ద్రంగా సాగిన ఆ యుగళగానం ప్రేక్షకులను పులకింపజేసిందనడానికి నిముషంపాటు ఆగకుండా మోగిన కరతాళధ్వనులే సాక్ష్యం.

ఆ వెలుగులో ఒకర్నొకరు ఒకేసారి చూసుకున్నారు. ఆ క్షణం ఇద్దరి హృదయాల్లో చిత్రించుకుపోయింది వెంటనే. తదనంతరం గురువుగారికి సన్మాన సత్కారాలు, కానుకలు, పూలహారాలతో వేదికంతా పూదోటలా, పర్వదినాన గర్భగుడిలా మారిపోయింది.

పాఠశాల, అధికారులు, మిత్రులు, శిష్యులు, పూర్వశిష్యులు, ఆత్మీయులు...ఎంతోమంది - వసుధైక కుటుంబక దృశ్యాన్ని సాక్షాత్కరింపజేస్తూ కన్నులపండువగా సాగిపోతున్న ఆ కార్యక్రమానికి మధుసూదన్ శ్యాఖ్యానం కొత్త వన్నెల్ని తెచ్చిపెట్టింది. ముఖ్యంగా తన చిన్ననాటి మిత్రులు వేదికపైకి వస్తూంటే చదువుకునే రోజుల్లో వారు చూపిన అమాయకత్వం, అజ్ఞానం, చేసిన చిలిపి చేష్టలవు అల్లర్లు...వర్ణించి చెబుతుంటే ఆ పువ్వులకు తోడు సభంతా నవ్వుల జల్లుల్లో మునిగిపోతూంది. కన్నీటి పన్నీటిలో పులకిస్తుంది అప్పుడప్పుడూ.

“అదేంటి ? గిఫ్టేమీ ఇవ్వకుండానే వచ్చారు ?” మాష్టార్ని కలిసి, బొకే ఇచ్చి వచ్చిన భర్తనడిగింది జాహ్నవి.

“అదే నాకిప్పటికీ అంతుచిక్కడంలేదు....” ముక్తసరిగా చెప్పి, కళ్లు మూసుకొని, ఆలోచనలో మునిగిపోయాడు శ్యామ్.

కార్యక్రమం సాగిపోతూంది. అధికారులు, అతిథులు, ఆత్మీయులూ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయస్పృహ తెలియజేస్తూనే పదిహేన్నిముగాలు తగ్గకుండా మాట్లాడారు. చివరకు చాలా మందికి అవకాశం రాలేదు. అందులో శ్యామ్ కూడా ఒకడు. పైగా ‘ అతనికి ప్రార్థన పాడే అవకాశమైనా లభించిది గదా !’ అని సరిపెట్టేశారు నిర్వాహకులు.

చివరగా శివానందం మాష్టారు చేతికెళ్లింది మైకు.

“పెద్దలకు, తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, అధికారులకు, ఆత్మీయులకు... సరస్వతీ స్వరూపులై సభలో ఆసీనులైన ప్రతి ఒక్కరికీ నమస్కారం ! నా మీద మీరు చూపిన ప్రేమాదరాలకు అందరికీ కృతజ్ఞతలు !

“నేను తరగతి గదిలోనే గాని, బహిరంగ సభల్లో మాట్లాడలేదు. నాకు తెలిసిన అతికొద్ది విషయాల్లో పిల్లలకు పనికొచ్చేవన్నీ వాళ్లకు చెబుతుంటాను, చెప్పేశాను. మంచే చెప్పానో - చెడే చెప్పానో, వాళ్లు సంస్కారవంతులు. చెడిపోలేదని మాత్రం చెప్పగలను. నా విద్యార్థుల్లో డాక్టర్లు, ఇంజనీర్లే కాదు. చెప్పులుకుట్టే వాళ్ళు, చెట్లెక్కే గీత కార్మికులూ, ఉన్నారు. కాని ఎవ్వరూ తమ వృత్తిని తక్కువగా భావించలేదు. దానికి అన్యాయం చేయలేదని, చేయరనీ భావిస్తున్నాను. నాలో లోపం వల్లగావచ్చు. నా శిష్యులంతా గొప్పవాళ్లు కాలేకపోయారు. కానీ

నేను చూపిన ఏ కొంత సంస్కారమో వాళ్లను సమాజంలో మంచివాళ్లుగా గౌరవింపబడేటట్లు చేస్తున్నదనే విషయాలు తెలిసినపుడు నా గుండె గర్వంతో పొంగిపోతూంటుంది.

"నా కన్నబిడ్డలు ఆశల విమానాలెక్కి అందని తీరాల్లో విహరిస్తున్నారన్న బాధ నాకెప్పుడూ కల్గలేదు. నా విద్యార్థులంతా నా బిడ్డలే. ఎవరో ఒకరు ఇప్పటికీ నన్ను పలకరిస్తూ, పరామర్శిస్తూ, ఆత్మీయత నందిస్తూండటం నేను చేసుకున్న పుణ్యం. భగవంతుడు నాకేలోటు ఇవ్వలేదు. ఉన్నన్ని నాళ్లు నేను స్వశక్తితోనే, ఇతరులపై ఆధారపడకుండా బతుకుతాను. నా బిడ్డల ఆత్మీయతా వలయం నా చుట్టూ నిత్యం పర్యవేక్షిస్తుంటే - అనారోగ్యం సైతం జడుసు కోదూ !

సభ చప్పట్లతో నిండింది. శిష్యుల కళ్ళు చెమర్చాయి.

"అదృష్టవశాత్తూ, నేను నా సర్వీసు ప్రారంభించిన బడిలోనే పదవీ విరమణ చేయడం, ఇక్కడికి నా పిల్లలు ఎంతోదూరం నుండి శ్రమకోర్చి నన్ను కలుసుకునేందుకు రావడం.... ఈ ఆత్మీయతే నిజంగా వాళ్లు సమర్పించిన కానుక ...!

"అంతా పూర్ణాయుష్కులై, అజరామరమైన కీర్తినార్జిస్తూ సుఖంగా ఉండాలని ఆ భగవంతున్నిన కోరుకుంటున్నాను !" చేతులెత్తి నమస్కరించారు.

సభలోని వాళ్ళంతా లేచి రెండు నిముషాలదాకా చప్పట్లు కొడుతూనే ఉండిపోయారు

0-0-0

శ్యాం, జాహ్నవి ఇంటికొచ్చేసరికి రాత్రి పదిన్నరైంది. చాలమంది అక్కడే ఉండిపోయారు. వీళ్ల పరిస్థితి తెలిసి పంపించేశారు.

"మీ పద్ధతి నాకేం నచ్చలేదు. " మంచమ్మీద పక్కసరిచేస్తూ జాహ్నవి

"సారీ జానూ ! నిన్ను తప్పనిసరై ఇబ్బంది పెట్టాను. కాని, ఇది జీవితంలో ఒకే ఒకసారి వచ్చే అవకాశం. అందుకే.. "

"నేను నచ్చలేదన్నది కార్యక్రమం గురించి కాదు. కార్యక్రమం నాకు చాలా చాలా బాగా నచ్చింది. ఆ పల్లె వాతావరణం, అక్కడి మనుషుల ఆత్మీయతలు... మీ చిన్ననాటి సంగతులు..... మీ మాష్టారు.....అన్నీ నచ్చాయి. నిజానికి చాలా అసంతృప్తితో ఇక్కడి నుండి బయల్దేరాను. కానీ మాటల్లో కొలవలేనంత సంతృప్తిని మూటగట్టుకొచ్చాను. మీ మేష్టారికి మీరేమీ ఇవ్వకపోవడమే నాకు నచ్చలేదు" మూతి ముడుచుకుంది.

"అది నాకూ అసంతృప్తిగానే ఉంది. కాని, బాగా ఆలోచిస్తే నాకొకటి తోస్తోంది. నేను వ్రాస్తున్న 'ధీరోదాత్తత్రిశతి'' త్వరలో పూర్తవుతుంది. అది భగవంతుడికి అంకితం ఇవ్వాలనుకున్నాను. ఆ దేవుడ్ని మించిన మా గురుదేవుడికి అంకితం చేయటమే నా కానుక ..." భార్య మొహంలోకి చూశాడు శ్యామ్.

క్షణంలో తేరుకొని, అంతలోనే అతడ్నల్లుకొని, మృదు చుంబనంతో తన ఆనందామోదాభినందనల్ని ప్రకటించింది జాహ్నవి.

"నీకిష్టమైన - పెళ్లిరోజు ప్రోగ్రాం చెడగొట్టానని కోపంగా లేదూ....?" ఆప్యాయంగా అడిగాడు జాహ్నవి.

"ఆ....ఆ...ఆ.. అంత తొందరపడి సంబరపడొద్దు కవిగారూ ! దానికి పెనాల్టీ రెడీగా ఉంది." బిత్తరపోయి చూస్తున్న శ్రీవారిని కొంటెగా చూస్తూ కొనసాగించింది జాహ్నవి - "ఇకపై ఇలాంటిరోజును ఇలా నాలుగ్గోడల మధ్య మనిద్దరికోసం, మన కుటుంబంకోసం గాకుండా ఏదో ఒక మంచి కార్యక్రమంలో పాలుపంచుకోవడంలో గడపాలి. అది దైవసన్నిధిలో అన్నదానం కావచ్చు. అనాథ బాలలకు ఆర్థిక సహకారం కావచ్చు. లేదా ప్రతి సంవత్సరం మీకు నచ్చిన ఒక మంచి ఉపాధ్యాయునికి సన్మానం చేయడం గావచ్చు..."

అలా మాట్లాడుతున్న జాహ్నవిలో ముందులేని అందమేదో కొత్త చివుళ్ళు తొడగడం గమనించి, ఆరాధనగా చూస్తుండిపోయాడు శ్యామ్. ❖